# జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయం



భాజగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా తదితరులు

శేరిలింగంపల్లి డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

■ ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి

దుండిగల్/జగద్గిరిగుట్ట/శేరిలింగంపల్లి/అల్లాపూర్/కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 21: ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నిజాంపేట్ రాజీవ్‌గృహకల్ప సముదాయంలోని జయశంకర్‌సార్ విగ్రహానికి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, నిజాంపేట్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వాకలపూడి రంగరాయ ప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

●జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, పోలీస్ ఔట్ పోస్ట్ వద్ద స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రొ.జయశంకర్ సార్ విగ్రహాన్ని కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు శ్రీనివాస్‌చారి, మనోహర్, భిక్షపతి, తిరుపతి, శ్రీశైలం,వీరాచారి, రమేశ్, కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

● శేరిలింగంపల్లి : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ సేవలు ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలకమైనవని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. శుక్రవారం గచ్చిబౌలి డివిజన్ భాజగూడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు సతీశ్ ముదిరాజ్, నారాయణ, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

●బాలానగర్: ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్‌సార్ ఆశయసాధనకు యువత కృషి చేయాలని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని వినాయక కాంప్లెక్స్ వద్ద జయశంకర్‌సార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● అల్లాపూర్ : ప్రొఫెసర్ జయశంకర్ సారు వర్ధంతిని పురస్కరించుకుని అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ ప్రధాన కూడలి వద్ద ఉన్న జయశంకర్ విగ్రహానికి బీఆర్ఎస్ ముఖ్యనేతలతో కలిసి డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి పూలమాల వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, పిల్లి తిరుపతి, జగన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

● కేపీహెచ్‌బీ కాలనీ: ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు జనగాం సురేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ 3వ ఫేజ్‌లోని జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానికులు ప్రభాకర్‌రెడ్డి, మురళీధర్ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పలో జరిగిన జయశంకర్‌సార్ వర్ధంతిలో పాల్గొన్న నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ తదితరులు

## హైదరాబాద్ కీ షాన్ ఉస్మానియా దవాఖాన

మోడ్రన్ కిచెన్‌ను ప్రారంభించిన మంత్రి దామోదర జనర్సింహ

■ మంత్రి దామోదర రాజనర్సింహ
■ ఎంఆర్ఐ, ఆధునికీకరించిన మెడికల్ ఓపీ, మోడ్రన్ కిచెన్ ప్రారంభం

సుల్తాన్‌బజార్, జూన్ 21: ఉస్మానియా దవాఖాన హైదరాబాద్ షాన్ అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం ఉస్మానియా దవాఖానలోని కులీ కుతుబ్ షా భవనంలో రూ. 13.97 కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ, ఓపీ బ్లాక్‌లోని మొదటి అంతస్తులో రూ.55 లక్షలతో ఆధునీకరించిన మెడికల్ ఓపీ, ఏఆర్‌టీ సెంటర్లను, రూ. 2.16 కోట్లతో మోడ్రన్ కిచెన్‌లను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీలు ఎం.ఎస్. ప్రభాకర్‌రావు, సురభి వాణిదేవి, మీర్జా రహమత్ బేగ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ శంకర్ యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. 1951లో నిర్మించిన జీఎస్ఎం నర్సింగ్ కాలేజీ హాస్టల్ శిథిలావస్థకు చేరడంతో నూతన హాస్టల్ భవనాన్ని నిర్మిస్తామన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణణ్, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.నరేంద్రకుమార్, టీజీఎంఎస్ఐడీసీ చీఫ్ ఇంజినీర్ దేవేందర్ పాల్గొన్నారు.

షాపూర్‌నగర్‌లో యోగా చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ సత్యనారాయణ తదితరులు

కొండాపూర్ బెటాలియన్‌లో యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

కేపీహెచ్‌బీకాలనీలో యోగ సాధన చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

# యోగాతో సంపూర్ణారోగ్యం

### ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

దుండిగల్/కుత్బుల్లాపూర్/కొండాపూర్/మియాపూర్/కేపీహెచ్‌బీ కాలనీ/అల్లాపూర్/శేరిలింగంపల్లి, జూన్ 21: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎంపీ ఈటెల రాజేందర్, పలువురు కార్పొరేటర్లు, సహా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పాఠశాలల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా నిర్వాహకులతో కలిసి యోగా ఆసనాలను వేశారు. షాపూర్‌నగర్‌లో సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాలలో జరిగిన వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయరాణితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

●కొండాపూర్: కొండాపూర్‌లోని 8వ పోలీసు బెటాలియన్ కమాండెంట్ సన్నీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బెటాలియన్‌లో కమాండెంట్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందితో యోగాసనాలను చేయించారు.

●కొండాపూర్‌లోని శారదా హైస్కూల్‌లో ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి ఆధ్వర్యంలో యోగా వేడుకలు నిర్వహించారు.

●మియాపూర్ : హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రిషి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో యోగా ఘనంగా నిర్వహించారు.

●కేపీహెచ్‌బీ కాలనీ : నిత్యం యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా కూకట్‌పల్లి ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్‌లో స్వచ్ఛ భారత్ అభియాన్ ట్రస్ట్, పతాంజలి యోగా సమితి, భారత్ స్వభిమాన్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

●యోగాతోనే ఆరోగ్యమని, ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగా సాధన భాగం కావాలని కూకట్‌పల్లి రామ్‌దేవ్‌రావు వైద్యశాల సీఈవో ఎన్.యోబు అన్నారు. వైద్యశాల ఆవరణలో కుముదిని దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్, రామ్‌దేవ్ రావు వైద్యశాలల ఆధ్వర్యంలో యోగా వేడుకలు నిర్వహించారు.

●కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్ రమ్యాగ్రౌండ్ మిత్రమండలి ఆధ్వర్యంలో యోగా గురువు మోర్ల రామకృష్ణను సన్మానించారు.

●అల్లాపూర్: నిత్య యోగసాధన చేయడం ద్వారా శారీరక,మానసిక ప్రశాంతత తో పాటు సంపూర్ణ ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని నీలిమా హాస్పటల్ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. నీలిమా హాస్పటల్ ఆవరణలో నిర్వహించిన యోగదినోత్సవంలో డాక్టర్లు, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ వెంకటేశ్వరనగర్‌లో ఉన్న సత్‌జ్ఞాన్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ లయన్ చింతల మల్లేశం, యోగా ట్రైనర్ మహేశ్వరీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి యోగా వేడుకలు జరుపుకున్నారు. స్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్,జూన్ 21

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ దవాఖానలో యోగా ద్వారా కలిగే ప్రయోజనాలు, ఆరోగ్య లాభాలను వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ కృష్ణ ప్రసాద్, పీడీయాట్రిషన్ డాక్టర్ జనార్దన్‌రెడ్డి, డాక్టర్ నిర్మలరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. – కొండాపూర్, జూన్ 21

## ఇండ్ల స్థలాలివ్వాలంటూ స్టాలిన్‌నగర్‌లో ఆందోళన

### పోలీసులతో తీవ్ర వాగ్వాదం

మియాపూర్, జూన్ 21: శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధిలోని స్టాలిన్‌నగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడి శేరిలింగంపల్లి మండలంలోని స్టాలిన్‌నగర్, ప్రశాంత్‌నగర్‌లలో సర్వే నం. 100, 101లోని ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇండ్ల స్థలాలు ఇస్తున్నారంటూ ప్రచారం జరగడంతో నగరంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు ఇక్కడికి తరలివచ్చారు. తమకు ఇందులో స్థలాలు కేటాయించాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో హెచ్ఎండీఏ అధికారులు, పోలీసులతో రంగ ప్రవేశం చేసి వారిని చెదరగొట్టే ప్రయత్నం చేయగా... తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలకు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొన్నది. కాగా పెద్ద సంఖ్యలో మహిళలు శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయానికి సైతం వెళ్లి అక్కడ ఇండ్లస్థలాల కోసం ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల ఇదే స్థలాల్లో గుడిసెలు వేయగా..హెచ్ఎండీఏ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు వాటిని తొలగించారు.

## ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థులకు అస్వస్థత

కొండాపూర్, జూన్ 21:కలుషిత ఆహారాలతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కొండాపూర్ శ్రీచైతన్య కళాశాలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. కలుషిత ఆహారాన్ని తిని తీవ్రఅస్వస్థతకు గురైన కొండాపూర్ శ్రీచైతన్య విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలంటూ ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్న భోజన అనంతరం 30 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలకు గురైనట్లు, అస్వస్థతకు గురైన విద్యార్థులను మాదాపూర్‌లోని విక్రమ్ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. సదరు కళాశాల అనుమతులపై మేనెలలోనే రంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సుధారాణికి ఫిర్యాదు చేయగా, నోటీసులు సైతం జారీ చేసినట్లు తెలిపారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్‌తోపాటు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, అనీల్‌కుమార్, మురళి, బాలు, విజయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

మాదాపూర్, జూన్ 21: ద్విచక్ర వాహనాలను దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. క్రైం ఇన్‌స్పెక్టర్ రమేశ్ నాయుడు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సత్యరాం కృష్ణ (35) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.ద్విచక్ర వాహనాలను దొంగిలించి జల్సాలు చేయడం అలవాటు చేసుకున్నాడు. హాస్పిటల్స్, వైన్స్, హోటల్స్, కళాశాలలు, షాపింగ్‌మాల్స్, పార్కింగ్ స్థలాల్లో హ్యాండిల్‌లాక్‌లు లేకుండా ఉన్న పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకొని ప్లగ్ వైర్లను జాయింట్ చేసి దొంగిలించి నారాయణపేటకు చెందిన ఉట్కూర్ నర్సింహ (32), మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గొల్ల నరేశ్ (29), మహబూబ్‌నగర్‌కు చెందిన మరో వ్యక్తి షకీల్ అహ్మద్ (32)కు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. ఈ నెల 21వ తేదీన మాదాపూర్ డీసీపీ పర్యవేక్షణలో ఏసీపీ ఆదేశాల మేరకు మాదాపూర్‌లో తనిఖీలు నిర్వహించారు. అటుగా వస్తున్న సత్యరాం కృష్ణ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించగా.. ద్విచక్ర వాహనాలను దొంగిలించి విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. దీంతో అతను విక్రయించిన 20 ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కృష్ణతోపాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేయగా..ఉట్కూర్ నరసింహ పరారీ ఉన్నాడు.

### 32 వాహనాల సీజ్

శేరిలింగంపల్లి, జూన్ 21:రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపుతున్న పలువురు వాహనదారులపై శుక్రవారం గచ్చిబౌలి పోలీసులు కేసులు నమోదు చేశారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంజయ్యనగర్ ఎస్ఎల్ఎన్ టర్మినస్ వ్యాపార ప్రాంతంలో, శ్రీరాంనగర్ కాలనీ, గచ్చిబౌలి డీఎల్ఎఫ్ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపుతున్న వారిని పట్టుకుని 32 వాహనాలు సీజ్ చేసినట్టు గచ్చిబౌలి ట్రాఫిక్ సీఐ రాజశేఖర్ రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

## బైక్ రేసింగ్‌లకు పాల్పడితే క్రిమినల్ కేసులు

### మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్

శేరిలింగంపల్లి, జూన్ 21:రాత్రి వేళల్లో ఐటీ రహదారులపై భయంకరమైన శబ్దాలతో బైక్ రేసింగ్‌లకు పాల్పడి ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మాదాపూర్ ఏసీపీ సీహెచ్.శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఇన్‌స్పెక్టర్ వెంకన్నతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రోడ్లపై బైక్ రేసింగులకు పాల్పడటం, మితిమీరిన వేగంతో భారీ శబ్ద కాలుష్యంతో విన్యాసాలు చేస్తే సహించేది లేదని, సదరు వాహనదారులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు ఈనెల 1వ తేదీన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాలెడ్జి సిటీ ఐటీ కారిడార్ టీ-హబ్ ప్రాంతంలోని రోడ్లపై భయంకరమైన స్టంట్స్‌తో విపరీతమైన శబ్దంతో కొందరు యువకులు బైక్ రేసింగులకు పాల్పడుతున్నట్లు తమకు విశ్వసనీయ సమాచారం అందిందని, దీంతో స్పెసల్ డ్రైవ్ చేపట్టామన్నారు. ఈఘటనలో 89 మంది బైక్‌రేసర్లను గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని 89 బైక్‌లు, రెండు కార్లు సీజ్ చేశామన్నారు. వారిపై మొత్తం 9కేసులు నమోదు చేశామని, కౌన్సెలింగ్ చేసినా వినిపించుకోని ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మైనర్లకు బైక్ విన్యాసాలు చేస్తూ పట్టుబడితే వారితోపాటు తల్లిదండ్రులపై సైతం చట్టరీత్యా క్రిమినల్ కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.

రేసింగ్‌లకు పాల్పడుతున్న బైక్‌లను పరిశీలిస్తున్న మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్

## సీసీ రోడ్డు పనులు పరిశీలన

మియాపూర్, జూన్ 21 : ఆల్విన్ కాలనీ డివిజన్ తులసీనగర్‌లో రూ. 20లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. యూజీడీ పూర్తయిన చోట సీసీ రహదారుల నిర్మాణాన్ని ముమ్మరం చేస్తున్నామన్నారు.

– నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పుట్టిన రోజును పురస్కరించుకుని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ మేయర్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

## వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 21: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్) మొదటి సెమిస్టర్, మూడేళ్ల ఫార్మ్‌డీ, ఆరేళ్ల ఫార్మ్‌డీ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును వచ్చే నెల 2లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుంతో 8 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు.

### వివిధ కోర్సులపరీక్షా తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ (ఓడీఎల్) మూడు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 25 నుంచి, మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 3నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. దూరవిద్యాకేంద్రం ద్వారా అందించే పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డేటా సైన్స్ రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

### 6 నుంచి సీపీజీఈటీ పరీక్షలు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల పరిధిలో అన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే సీపీజీఈటీ – 2024 పరీక్షల తేదీలను ఖరారు చేసినట్లు సీపీజీఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ. పాండురంగారెడ్డి తెలిపారు. సీపీజీఈటీని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 45 సబ్జెక్టులలో పరీక్షలను వచ్చే నెల 6 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. హాల్‌టికెట్లను వచ్చే నెల 3 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

## తుమార్ చెరువు ఆక్రమణపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు

కుత్బుల్లాపూర్,జూన్21:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లిలో ఉన్న తుమార్ చెరువు ఆక్రమణకు గురవుతుందని, వెంటనే దీనిపై జిల్లా యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయంలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గుండ్లపోచంపల్లి, కొంపల్లి మున్సిపాలిటీ సరిహద్దుల్లో ఉన్న తుమార్ చెరువు సగానికి పైగా ఆక్రమణకు గురైందని, చెరువును పూడ్చి వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేస్తూ భవిష్యత్‌లో ఆటంకాలకు గురి చేసే విధంగా ఆక్రమణలకు గురవుతుందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి నిబంధనలకు విరుద్ధంగా, యథేచ్ఛగా సాగుతున్న చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## చికిత్స పొందుతూ మృతి

దుండిగల్,జూన్21: వైద్యశాలలో చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వృద్ధుడు మరణించిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పది రోజుల కిందట గుర్తుతెలియని వృద్ధుడు దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, మల్లంపేట్‌లోని ఔటర్‌రింగ్‌రోడ్డు బ్రిడ్జి కింద అచేతన స్థితిలో ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని చికిత్స కోసం దుండిగల్‌లోని అరుంధతి వైద్యశాలకు తరలించారు. రోజు రోజుకు ఆరోగ్యం క్షీణిస్తుండటంతో మెరుగైన చికిత్స కోసం ఐదురోజుల కిందట గాంధీ వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే దుండిగల్ పీఎస్‌లోగాని గాంధీ మార్చురీ వద్దగాని సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ■ మర్రి లక్ష్మణ్‌రెడ్డికి సత్కారం



మర్రి లక్ష్మణ్‌రెడ్డిని సత్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

దుండిగల్,జూన్21:ఇటీవల గుజరాత్‌తో పాటు హైదరాబాద్ నగరంలో జరిగిన వెటరన్ సిమ్మింగ్స్ పోటీల్లో పాల్గొని 7 పతకాలను సాధించిన మర్రి లక్ష్మణ్‌రెడ్డి విద్యా సంస్థల అధినేత, వెటరన్ అథ్లెట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డిని కేంద్ర భూగర్భ, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సత్కరించారు. గురువారం ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా నగరంలోని నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభినందిస్తూ, సత్కరిండంతోపాటు ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో నందనం కృపాకర్,ఎంఎల్ఆర్ఐటీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ నాయిని ఉదయరంజన్‌గౌడ్‌తోపాటు కళాశాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, కళాశాల సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.శ్రీనివాస్‌రావు, డైరెక్టర్ శ్రేయారెడ్డిలు మర్రిలక్ష్మణ్‌రెడ్డి సత్కారం పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## ■ సీఎం సహాయ నిధితో ఉచితంగా కార్పొరేట్ వైద్యం